# ఎన్నిక ఉబలాటం

★

శ్రీ జి. యస్. సూరి

ప్రొద్దుకూకేసరికి మా బృందం వాళ్లు అందరూ క్లబ్బు డాబామీదికి చేరుకున్నారు. తలా ఒక పేము కుర్చీలో చేరగిలబడ్డారు.

"వెధవ నల్లులు. కాస్త డి. డి. టి. అయినా వీటి ముఖాన కొట్టకూడదూ?" అన్నాడు కుర్చీని చేతి కొద్దీ చరుస్తూ మీసాలనాయుడు.

"మరేమీ ఫరవా లేదులే; కావలసినంత కళేబరం పెంచావు," అన్నాడు చెట్టియారు.

"అతికాయులూ మహాకాయులూ ఒకరికొకరు తీసిపోరులే. ఇంతకూ పార్టీ ఎప్పుడురా ఇవ్వటం?" అన్నాడు శాస్త్రుల్లు భాయి.

"పాటిమీద గంగానమ్మకు కూటిమీదే లోకం. ఎవడు పిలుస్తాడా, ఎవడికొంప తీతామా అని తప్ప మరో ఆలోచన లేదు గదా మనవాడికి!" అన్నాడు తొండమాన్.

"ఎవరు ఎవరికిరా పార్టీ ఇస్తున్నదీ?" అని అడిగాడు డాక్టరు టింగన్.

"ఓహో, నీవీ మధ్య ఊళ్ళో లేవు గాదూ! మన కొత్త ఎం. ఎల్. ఏ గారికి చెట్టియారు విందు చేస్తాడుట," అన్నాడు మీసాలనాయుడు.

"చెప్పవేంరా చెట్టియార్? చేగోడీలు తప్పక చేయించుసుమా!" అన్నాడు డాక్టరు టింగన్.

"ఒక చేగోడీలు ఏమిటిరా! ఎన్ని అయినా చేయిస్తాడు. ఇదంతా మన వాడి వ్యాపారానికి పెట్టుబడేగా!" అన్నాడు శాస్త్రుల్లు భాయి.

"ఇంతకంటె అసలు వీడే ఎలక్షనుకు నిలబడి వుంటే భాగుండేది. ఇతరులను ఆశ్రయించకుండా లకారాలకు లకారాలు చేర్చి పారేసేవాడు," అన్నాడు మీసాలనాయుడు.

"ఇప్పటికైనా మించిపోలేదు. అప్పర్ హౌసుకు నిలబడితే సరి. మనల్నిగూడా కొంచెం ఆదుకోవచ్చు," అన్నాడు తొండమాన్.

"మనవాడికి పై అంతస్తులో నేగా ఖాళీ! తప్పకుండా నిలబడవలసిందే," అన్నాడు శాస్త్రుల్లు భాయి.

"ఏడిశావులే. అంత తెలివితేటలుంటే పట్టభద్రుల సీటుకు నిలవరాదూ పళ్లభద్రయ్యావు?" అన్నాడు చెట్టియారు.

"మా మామయ్యకూడా ఇట్లాగే అనుకుని చెలరేగాడులే" అన్నాడు డాక్టరు టింగన్.

"అవును రోయ్. అన్నట్లు నీవు ఈమధ్య క్యాంపు వేసింది అందుకే గాదూ! చెప్పరా గొడవా," అన్నాడు మీసాలనాయుడు.

మేమందరం కుర్చీలను దగ్గరకు లాక్కున్నాము. సిగరెట్టు వెలిగించి కథ ప్రారంభించాడు డాక్టరు టింగన్.

"కామయ్యపంతులు మా మేనమామ; కరణంగారి వంశోద్ధారకుడు. ఆట్టే దండయాత్రలు కొట్టకుండా చదువు పూర్తిచేసి జిల్లాకోర్టు లాయరుగా చెక్కు తగిలించాడు. మావాడు ప్రాక్టీసు పెట్టిన కొద్దికాలానికి కరణంగారు పరలోకానికి ప్రయాణం కట్టాడు. ఇరవై ఎకరాల మాగాని పొలం, గుమ్మడికాయ అంత రొఖ్ఖం మా మామయ్యకు సంక్రమించినవి. రెక్క ఆడితేనేగాని డొక్క ఆడదనే భయం లేనందువల్ల ప్లీడరీకానికి కరిణీకపు లౌక్యం జోడు చేసి ప్రాక్టీసు సాగించాడు. వారసత్వపు దావాల స్పెషలిస్టు అయినాడు. కేసుకు కావలసిన పెట్టుబడి యావత్తూ మావాడే పెట్టి, గెల్చిన ఆస్తిలో సగానికి పైగా కబళించివేసేవాడు.

ఆ వూరిలో బుడేసాహెబ్ అనే తోళ్ల వ్యాపారస్తుడు ఒకడు ఉండేవాడు. ఆయన యుద్ధపు రోజులలో ఒకసారి పెద్దఎత్తున సరుకు ఎగుమతి చేశాడు. దోవలో స్టీమరు మునిగిపోయింది. షిప్పింగ్ ఇన్సూర్యెన్సు కంపెనీమీద దావా వేయవలసి

వచ్చింది. మా మామయ్యే ఆయనకు ప్లీడరు. వెధవ పేచీలన్నీ వేసి అసలుకు మించిన మొత్తానికి డిక్రీ పొంది పైసలతోసహా వసూలు చేశాడు. యుద్ధపు హడావుడిలో బ్యాంకీలో దాచటానికి సాహేబు గారు భయపడి నమ్మకంమీద ఆ డబ్బును మా మామయ్య దగ్గర నే ఉంచమన్నాడు. ఇంతలో బుడే గారికి మక్కా చూసిగావాలనే బడా కోరిక కలిగింది. మావాడు ఆయనను స్వయంగా వెంటబెట్టుకుని బొంబాయిదాకా వెళ్ళి బోటు ఎక్కించి వచ్చాడు. హాజీగారు తిరిగి వస్తూఉండగా ఏడెన్‌లో కలరాతగిలి అసలైన మక్కాయాత్రకు ఉడాయించాడు. ముప్పయివేలరూపాయిలు మా మామయ్య బొజ్జలో జీర్ణమైపోయినవి.

ఇట్లా ఉంటూఉండగా ఎన్నికల అలజడి బయలుదేరింది. ముదనష్టపు డబ్బు ఇంత ఉన్నది గదా ఒకచేయి చూతామని మా వాడికి దుర్బుద్ధి పుట్టింది. చాలకాలంనుంచీ ఆయనకు ఆస్థాన జ్యోతిష్కుడుగా ఉండే సిద్ధాంతిగారిని పిలిపించాడు. చక్రం చేతికి ఇచ్చి రాబోయే రెండుమూడు మాసాలలో తన భవిష్యత్తు తేల్చిచెప్పమన్నాడు.

సిద్ధాంతిగారు మాటల సందర్భాన్నిబట్టి మా వాడి కోర్కెను కనిపెట్టాడు. ఒక కాగితంనిండా కూడికలు తీసివేతలు చేశాడు. పంచాంగం అటూ ఇటూ తిప్పాడు. క్షణం కళ్ళు మూశాడు.

"పంతులుగారికి ఇప్పుడు రాజ్యాధిపతి దశలో లాభాధిపతి భుక్తినడుస్తున్నది," అన్నాడు సిద్ధాంతి.

"ఎట్లా వుంటుందంటారు?" అన్నాడు మా మామయ్య.

"చెప్పవలెనా! చాల యోగప్రదంగా ఉంటుంది."

"అంటే ఇంకా డబ్బు సంపాదిస్తానంటారా?"

"డబ్బేకాదు. పదవి. జడ్జీ కావచ్చును. లేదా..."

"ఇప్పుడు జడ్జీసంగతి ఎందుకులెండి. రాజకీయంగా యోగిస్తుందేమో చూడండి. శాసనసభాప్రవేశం..."

"అదే చెప్పబోతున్నాను. వృద్ధపారాశరిలో.." అని రెండు శ్లోకాలు చదివి అన్వయించి చెప్పాడు.

"అయితే ఏదో ఉన్నదన్నమాట."

"నిస్సంశయంగా. గురువు కదలాలి"

"త్వరగా కదిలింతురూ."

"వచ్చేనెల పదిహేనో తేదీన మిత్రనవాంశలోకి వస్తాడు. ఆపైన శని షష్టమంలో సంచారం."

"అయితే తూలినా ఫరవాలేదంటారు."

"ఫరవా యేమిటండి. జైమినిగూడా చెప్పాడు తప్పదు."

"ఎం. ఎల్. ఏ అయినానా, కోటలో ప్రవేశించానుకోండి. అయితే నామినేషన్ వేయడానికి ముహూర్తం పెట్టండి."

సిద్ధాంతిగారు సుముహూర్తం నిశ్చయించారు.

ముహూర్తం అయితే సులభంగా నిశ్చయమయిందిగాని ఏ పార్టీ టిక్కెటుమీద నిలబడడమూ అనేది క్లిష్టసమస్యగా పరిణమించింది. పూర్వపు ఎన్నికలనుబట్టి చూస్తే పూచికపుల్లను గూడ నిలబెట్టి గెలిపించగలిగినది కాంగ్రెస్‌పార్టీ అని స్పష్టంగా కనబడ్డది. అటువంటప్పుడు ఇంతలావు లాయరు పంతులును కళ్ళ కద్దుకొని తీసుకుంటారులే అనే ధీమా తెచ్చుకున్నాడు. ఎకాయికి హైకమాండువారిని ఆశ్రయిస్తే తంటా వస్తుందేమోనని ప్రాంతీయపు లోకమాండును ఆశ్రయించాడు.

లోగడ తాను అనేకమార్లు కాంగ్రెసు ఫండుకు బహిరంగంగాను, ప్రచ్ఛన్నంగాను ఎన్ని విరాళాలు ఇచ్చిందీ ఏకరువు పెట్టాడు. ఎంతమంది ఛోటా నాయకులకు రైలుటిక్కెట్లు కొనిపెట్టిందీ జ్ఞాపకం చేశాడు. పర్మిట్ వ్యాపారస్తులను కోర్టులలో ఎంతమందిని ఆదుకున్నదీ జాబితాలు చదివాడు. పార్టీ ఫండుకు పాతిక వేలదాకా ముట్టచెపుతానని విన్నవించాడు. కాని ప్రయోజనం లేకపోయింది. "నీవు చదువుకున్నవాడివి కావటంవల్లనూ, ఈ నియోజక వర్గంలో అల్పసంఖ్యాకమైన కులానికి చెందినవాడవు కావటంవల్లనూ, పార్టీ ఎన్నికలలో హైకమాండుకు అండగా ఉంటున్న ఒక ముఠానాయకుడికి ఇదివరకే వాగ్దానం జరిగిఉన్నందువల్లనూ, నీకు సీటు మంజూరుచేయుటకు మహాత్మగాంధీ వరప్రసాద సర్వోదయ సూత్రాలు అనుమతించవు" అని నిష్క

ర్షగా చెప్పారు. మా మామయ్య మీసం దువ్వి "జెండాపై కపిరాజు...ఒక్కండేనియు నీ మొర ఆలకింపడు" అనే పద్యాన్ని గంభీరంగా లోలోపల చదువుకున్నాడు.

ఆ తరువాత మావాడు ప్రజాపార్టీకి అర్జీ దాఖలు చేశాడు. కాంగ్రెసుసంస్థలోని కుళ్లును బయటపెట్టటానికి బద్ధకంకణం కట్టుకున్నాను అని విన్నవించాడు. కాంగ్రెస్ మంత్రివర్గాల అవినీతిని కడిగిపోయడమే నా జీవితాశయం అన్నాడు. ఆంధ్రావనికి ఏకైకనాయకుడు కేసరి తప్ప మరొకడు లేడని ఊరూరా పల్లెపల్లెనా గర్జిస్తానన్నాడు. తన ఎలక్షను ఖర్చులు తాను పెట్టుకోనడమేగాక ఇద్దరు ముగ్గురు దాకా పార్టీ ఇతర అభ్యర్థులను ఆదుకుంటానన్నాడు. "నీవు నిజంగా మా పార్టీతరఫున నిలబడవలసినవాడివేరా. కాని నిన్ను మేము నిర్ణయిస్తే యిన్నాళ్లు మమ్మల్ని ఆశ్రయించి తిరుగుతున్న ఫలానావాడు రైలుకిందపడి చచ్చిపోతానంటాడు. ఏమి చెయ్యమంటావు? కాస్త ఓపిక పట్టు. కవున్సిల్ విషయంలో చూదాం" అన్నది హైకమాండు. చూడండోయ్ పంతుల తడాఖా అన్నాడు మా వాడు.

ఆపైన మా మామయ్య దృష్టి కృషీకార్ పార్టీ మీదికి మళ్ళింది. నేను కూడా ఒకే పార్టీ, ఒకే నాయకుడు, ఒకే కులం అనే సూత్రాన్ని అక్షరాలా ఆమోదిస్తున్నానని చెప్పుకున్నాడు. పార్టీ అండ ఇచ్చినట్లయితే రైతులను సమూలంగా తవ్వి తలకెత్తుతానని అభయహస్తం ఇచ్చాడు. జై రంగరంగా అని గొంతు బొంగురుపోయేదాకా ఎలుగెత్తి కేకలు పెట్టాడు. కాని లాభం లేకపోయింది. మా మామయ్య జిల్లాకు సంబంధించినంతవరకూ అన్యకులాల అభ్యరులకు అవకాశం లేదు. కాబట్టి పంతులుగారిని దయ చేయమన్నారు. ఇంతివాడిని పట్టుకుని ఇంత చులకన చేస్తారా, కాచుకోండి అన్నాడు మా వాడు.

ఇప్పటికి మా మామయ్య కొంచెం పస్తాయించి వెనకా ముందూ ఆలోచించాడు. కాసేపు సోషలిస్టులను ప్రాధేయపడదామా అని నీరసుడైనాడు. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనక పడి చావటమేమిటని మనసు నిబ్బరపరచుకున్నాడు. ఎవరికో దణ్ణం పెడితే నావలెనే వేయేళ్లు వర్ధిల్లమన్న వ్యక్తిని జ్ఞాపకం చేసుకున్నాడు. ఆ ప్రమేయమే పనికిరాదని నిశ్చయించుకున్నాడు.

ఇక మిగిలింది కమ్యూనిస్టు పార్టీ. ఆ పేరు తలుచుకునేటప్పటికి మావాడికి గుండె ఝల్లుమన్నది. నిక్షేపంలాంటి ముప్ఫయి యకరాల మాగాని పొలం, బస్తీలో లంక అంత మేడ, ప్రతి బ్యాంకీలో తనకు ఉన్న సొత్తూ మొదలైనవి ఒక్క సారి మనసులో సినిమా మాదిరి మెరిసిపోయినవి. అరోంపిలో కాలుపెడితే ఏమవుతానా అని ఆలోచించిచూశాడు. ఈకెలుపీకిన కోడి మాదిరి తనకు తాను కనబడ్డాడు. వ్రతం చెడ్డా ఫలం దక్కుతుందా అంటే అదీ అప్పుడు అనుమానంగానే తోచింది. తోటి లాయర్లుకూడ ఓట్లు ఇవ్వరుసరిగదా భార్య నూతిలో దూకుతుందేమోనని భయపడ్డాడు. కామయ్యపంతులు కామ్రేడ్ కావటం ఏమిటని అసహ్యించుకున్నాడు.

తానిక స్వాతంత్ర్యం ప్రకటించవలసిందేనని తేల్చుకున్నాడు. దక్షిణహస్తంతో కాంగ్రెస్‌నూ, వామహస్తంతో కిసాన్లనూ, ఎడమకాలితో సోషలిస్టులను, కుడికాలితో కమ్యూనిస్టులనూ ప్రతిఘటించటానికి దృఢనిశ్చయుడైనాడు. వెంటనే ప్రయత్నానికి పూనుకున్నాడు. తన క్లయంట్లకు రమ్మని కబురు చేశాడు. లాయర్లు, డాక్టర్లు, టీచర్లు మొదలైనవాళ్ల దగ్గర వాగ్దానాలు తీసుకున్నాడు. చీకటిబజారు మిత్రులని హెచ్చరించివచ్చాడు. మునిసిపల్ చైర్మను గారిని పట్టుకుని మునిసిపల్ ఉద్యోగులందరికీ తాఖీదులు జారీచేయించాడు. మఠంలో బావితవ్విస్వానని స్వాములవారిచేత శిష్యకోటికి ఉత్తరువులు పంపించాడు. కాజీ సాహేబును పిలిపించి రెండువాకఫులు మంజూరు చేయిస్తాను, ముస్లిం ఓట్లనుబందోబస్తుచేయమన్నాడు. నిమ్నజాతిసంఘనాయకులను ఆహ్వానించి గూడెగూడాన ఉన్న దేవాలయాలకు నిత్య నైవేద్య దీపారాధనలకు తగిన వసతి ఏర్పాట్లు కలుగచేస్తానన్నాడు. హాస్టళ్లకు పోయి స్కాలర్‌షిప్పులు వాగ్దానం చేశాడు. ఈవిధంగా అడిగినవారికీ అడగనివారికీ వరాలను నమోదుచేశాడు. మా మామయ్య.

మల్లయ్య మా మామయ్య గుమాస్తా. గుడినీ లింగాన్ని మింగగల అసాధ్యుడు. మావాడు మల్ల

య్యని పిలిచి "ఈ ఎలక్షను తేలిపోయేవరకూ కోర్టు దస్త్రాలు మూలపెట్టి ఉంచు. అర్జంటు వ్యవహారాలన్నీ చిట్టిపంతులుకు ఒప్పగించాను. మిగతావి వాయిదా లాగేశాను. ఇప్పటినుంచీ పూర్తి అయేదాకా అన్ని ఏర్పాట్ల భారమూ నీదే. ఖర్చు ఎక్కువాతక్కువా అని సంశయంవద్దు. తిమ్మిని బ్రహ్మిని చేసి నన్ను ఒడ్డున పడవేయాలి" అన్నాడు.

"మీరు తలచుకుంటే అదెంతపని పంతులుగారూ! ఈ ఎన్నిక ఒక లెఖ్ఖా? దేవుడు మేలు చేయాలిగాని రేపు ఈపాటికి కిలా మినిస్టరు అయిపోరూ!" అన్నాడు మల్లయ్య.

మా మామయ్యఎన్నికలకు సంబంధించిన చట్టాలనూ రూల్సునూ అతిజాగ్రతతో పరిశీలించాడు. నామినేషన్‌ఫారాలు ఒకటికి నాలుగు తెప్పించాడు. అమృతహస్తులని పేరుబడ్డ వ్యక్తులచేత వాటిమీద సంతకాలు చేయించాడు. ఓటర్లజాబితాలు విరివిగా కొని వాటినిబట్టి వార్డువార్డుకూ, వీధి వీధికీ ప్రత్యేకంగా లిస్టులు తయారు చేయించాడు.

మా మామయ్య అనేక లిమిటెడ్ కంపెనీలకు డైరెక్టరుగా ఉండేవాడు. ప్రభుత్వంతో కంట్రాక్టులు ఉన్న ఒక కంపెనీ డైరెక్టరుపదవికి రాజీనామా ఇచ్చి ఆ సంస్థతో తెగతెంపులు చేసుకున్నట్లు అధికార రీత్యా పత్రం పంపమని వ్రాసి పంపాడు. పత్రికలకు ప్రకటనలు ఇచ్చి పత్రికా విలేఖరులకు విందు చేశాడు.

ఇంతలో సిద్ధాంతిగారు పెట్టిన ముహూర్తం సమీపించింది. కాని ఇంకా తన డైరెక్టరు పదవి రద్దు అయినట్లు అధికారపత్రం రాలేదు. టెలిగ్రాములు, ట్రంకుఫోనులు మారుమోగి పోయినవి. చివరకు మల్లయ్యను స్వయంగా మద్రాసు వెళ్లి రమ్మన్నాడు. ఆరోజు ఉదయం 11 గంటలు మొదలుకుని 11-30 గంటల లోపుగా నామినేషన్ వేసితీరాలి అని దైవజ్ఞుడి హుకుం. పాపం మల్లయ్య రైలు దిగి ఆలస్యంగా రావటాన పత్రం అందేసరికి 12 గంటలయింది. కాస్తలో మించిపోయింది ఏమిటిలే అని మనసుకు తృప్తిచెప్పుకుని జన్మకు మొదటి తడవగా రామనామం జపిస్తూ 12-15 కు నామినేషన్ ఫారాన్ని అధికారికి దాఖలు చేశాడు.

అయినా ముహూర్తం కొంచెం దాటిపోయినందుకు మావాడు అదుర్దాపడి సిద్ధాంతిగారిని పిలిపించి కర్తవ్యం చెప్పమన్నాడు. సిద్ధాంతిగారు తల పంకించి, పెదవులు కంపించి, చేతులు ఝాడించి, నవగ్రహశాంతిచేసి స్వర్ణదానం చేయమని సలహా ఇచ్చారు. కర్మకాండ యావత్తూ యథాతథంగా జరిపించాడు మా మామయ్య."

ఈ కథ చెపుతూఉండగా చెట్టియార్ మా అందరికీ డ్రింక్సు తెప్పించి ఇచ్చాడు. డాక్టర్ టింగన్ ఇంకొక సిగరెట్టు ముట్టించి కథను తిరిగి అందుకున్నాడు.

"ఎన్నికల తేదీ సమీపిస్తున్నకొద్దీ మా మామయ్యకు వేడి ఎక్కిపోయింది. ఫిలింకంపెనీవాళ్లు తమ మహోజ్వల చిత్రరాజాన్ని విడుదలచేసే ముందు జరిపించే హంగామామాదిరి ఎన్నికల ప్రచారం నడిపించాడు. ప్రతిగోడమీద చేటలంత అక్షరాలతో చెరువంత పోస్టర్లను అంటించారు. ఇవి చాలక తెల్లని ప్రహరీలమీద నల్లని తారు అక్షరాలను చిత్రించారు. నడిరోడ్లమీద సున్నంతో వ్రాయించారు. రోజు జీతాలమీద క్యాన్‌వాసర్లను నియమించారు. పాత గ్రామఫోను హారన్లు పట్టుకుని "ఓటు ఎవరికి? కామయ్యపంతులుకు," అని అరిచేందుకు కుఱ్ఱకారును ఏర్పాటుచేశారు. ఒక మోటర్‌వాన్‌లో లౌడ్‌స్పీకర్లను అమర్చారు. ప్రతిచౌకులోను కారును ఆపి ప్రఖ్యాతగాయకుడిచేత పాటలు పాడించారు. గుక్కతిప్పుకోకుండా మాట్లాడగల్గినవాళ్లు మా మామయ్యను పొగడుతూ గంభీరోపన్యాసాలు చేశారు. వీధినాటకాలు ఆడించారు. వీరంగం వేయించారు.

ఎల్లుండి ఎన్నిక అనగా మా మామయ్య పూర్తిగా కైపులో ఉద్రూత లూగిపోతున్నాడు. మల్లయ్య నురుగులు కక్కుతున్నాడు. గంటకొకసారి మావాడిదగ్గరకు వచ్చి తోటపాలెం ముఠా నాలుగువందల ఓట్లనూ అయిదువందల రూపాయలకు ఫైసల్ చేసేశాను అనేవాడు. అతుకు మెత్తని పేటలో ఏడువందల ఓట్లకూ వెయ్యిరూపాయిలు సెటిల్ చేసేశాను అనేవాడు. ఖర్చు అయితే అయింది ఫకడ్ బందీగా కమ్మకురా అని మా మామయ్య హెచ్చరించేవాడు.

మావాడుకూడ స్వయంగా తన కారులో రాత్రీ పగలు అనక తిరిగాడు. ఏ గూడెంలోకి వెళ్లినా, కారు ఆగగానే ఒకడు ముందుకు వచ్చి "పంతులుగారూ! ఈ వార్డు అంతా మీదే అనుకోండి. అనవసరంగా మీరు రాబోకండి. వస్తే అవతలివాళ్లు వచ్చి పేచీలు వేస్తారు. అంతా మేము చూసుకుంటాము. తమరు దయచేయండి" అనేవాడు. కాఫీ ఖర్చులకు ఒక వంద వాడిచేతిలో పారేసి మా మామయ్య చిరునవ్వుతో మరొక చోటికి బయలుదేరేవాడు.

ఇక తెల్లవారితే ఎన్నిక. ఆ సాయంత్రంతో గంద్రగోళం అంతా సద్దు మణిగింది. రాత్రియావత్తూ మా మామయ్యకు కునుకుపట్టలేదు. గదిలో పచారు చేస్తూ తెల్లవార్లూ చుట్టలు తగలేస్తునే ఉన్నాడు. తెల్లవారుఝామున నాలుగు గంటలకు గుమాస్తా మల్లయ్య వచ్చాడు.

"ఏం మల్లయ్యా! సిచుయేషన్ ఎట్లాఉన్నది?"

"ఫస్టుగా ఉన్నది పంతులుగారూ. కాజీ సాహెబ్ గారు నాలుగువేల ముస్లిం ఓటర్లను పెద్ద మశీదులో రాత్రినుంచి హాజరు పెట్టాడు. పోలింగ్ బూతులు తెరవగానే వడగళ్లవాన మాదిరి ఓట్లను కురిపిస్తానన్నాడు. లింగడిగుంటనుంచి, సోమార్లపాలెం నుంచి, పెట్లదిమ్మె నుంచి ముఠాలు ముఠాలుగా బయలుదేరి వస్తున్నారు," అన్నాడు.

"ఇతర అరేంజిమెంట్లు ఎట్లా ఉన్నయ్యో?"

"పంతులుగారూ! మల్లయ్యమతిమరుపు మనిషి కాదండోయ్. ఊళ్లో ఉన్న బండ్లనూ, టాక్సీలను అన్నిటినీ బుక్ చేసి వార్డువార్డుకూ పంపించాను. బళ్లు దొరకక ఇతర పార్టీలవాళ్లు ముక్కున వేలు వేసుకుంటున్నారు" అన్నాడు.

"జాగ్రత్త మల్లయ్యా! బళ్లు మనవని తెలిస్తే ఎలక్షన్ నేరం అవుతుంది సుమా!" అన్నాడు మామయ్య.

"నే నేమీ వ్యవహారం తెలియనివాణ్ణిటండి పంతులుగారూ?" అన్నాడు మల్లయ్య.

మల్లయ్య వెళ్లిపోగానే స్నానాదులు పూర్తి చేసి సూర్యోదయం కాకమునుపే ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్ళాడు. ఇంత, సింధూరంబొట్టు పెట్టుకుని కారులో ప్రతి బూత్ దగ్గరా సిచుయేషన్ తెలుసుకుంటూ తిరగటం మొదలుపెట్టాడు. అన్ని స్టేషనులలోను మా వాడి ఏజంట్లు ప్లీడరుగుమాస్తాలే. గెలుపు మనదేనండీ అన్నారు జంకూ గొంకూ లేక.

మధ్యాహ్నం మళ్ళేసరికి మా మామయ్యకు విపరీతంగా తలనొప్పి బయలుదేరింది. కారులో కూర్చునే ఓపిక కూడ లేకపోవటంవల్ల ఇంటికి పోయి ఆస్ప్రి. వేసుకుని నిద్రపోయాడు. అట్టే గొడవ లేమీ లేకుండా ఓటింగు ముగిసింది.

మూడవరోజు సాయంత్రానికి ఓట్లను లెక్కపెట్టటం పూర్తిఅయింది. సోదిలోకి కూడా రాని కమ్యూనిస్టు అభ్యర్థి పదిహేను వేల మెజారిటీతో గెలిచాడు. మా మామయ్యకు డిపాజిట్ పోయింది.

ఆ రాత్రి భోజనాలుచేసి మా మామయ్యా, నేను, మల్లయ్య, సిద్ధాంతిగారు వసారాలో కూర్చుని ఉన్నాము.

"ఖర్చు అంతా లెక్క చూశావా మల్లయ్యా" అన్నాడు మామయ్య.

"చిత్తమండి. ఇరవై ఏడు వేల అయిదు వందల పై చిల్లర అయింది" అన్నాడు మల్లయ్య.

"ఓటుకు యాభై పైన అయినట్లుందే" అన్నాను నేను.

"అయితే ఏమిరా. నేను పట్టుబట్టి ఓడించదలచుకున్న మూడు పార్టీలు ఓడిపోయినవి. నేను గెలిస్తేనేమి; ఓడితే నేమి?" అన్నాడు మా మామయ్య.

అప్పటిదాకా మాట్లాడకుండా కూర్చున్న సిద్ధాంతిగారు గొంతు కొంచెం సవరించుకొని "ముహూర్తం మించకుండా నామినేషన్ వేసిఉంటే పర్యవసానం ఇట్లా ఉండకపోను, పంతులుగారూ," అన్నాడు.

"అంతేనంటారా సిద్ధాంతిగారూ! ఏమోలెండి చెప్పలేము. గురుడు కదిలాడు కాబట్టి ఇక జడ్జీ సంగతి చూతాం" అన్నాడు మామయ్య.

అనగానే లేచి నిలబడ్డాడు డాక్టర్ టింగన్. మేమూ లేచాము. కొంపలకు బయలుదేరాము.

(ఇందులో వ్యక్తులు, ఘట్టాలు, కల్పితాలు ఎవరినీఉద్దేశించి వ్రాయబడినవి కావు-రచయిత)

———